బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 01 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 3

## ఎల్అండ్‌టీ మెట్రోకు అంతర్జాతీయ పురస్కారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జర్మనీలోని హాంబర్గ్‌లో ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక యూఐటీపీ–2025 అవార్డుల కార్యక్రమంలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి (హైదరాబాద్) ఎల్అండ్‌టీ మెట్రో రైలు లిమిటెడ్‌కు ప్రత్యేక గుర్తింపు పురస్కారాన్ని దక్కించుకుంది. రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ(ఆర్టీఏ) తోడ్పాటుతో ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ 'ఆప్టిమైజ్డ్ మెట్రో ఆపరేషన్ ప్లాన్స్ లీడింగ్ టు ఇన్‌క్రీజ్డ్ రెవెన్యూ పర్ ట్రెయిన్' ప్రాజెక్టుకుగాను తాజాగా ఈ పురస్కారం లభించింది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్(యూఐటీపీ) నిర్వహించే ఈ పురస్కారాల కార్యక్రమం అర్బన్ మొబిలిటీని తీర్చిదిద్దుతున్న పరివర్తనాత్మకమైన ప్రాజెక్టులకు విశిష్ట గుర్తింపునిస్తోంది. గ్లోబల్ నెట్‌వర్క్ యూఐటీపీలో దాదాపు 100కుపైగా దేశాల నుంచి వివిధ ప్రజారవాణా మాధ్యమాలకు చెందిన 1,900 ఆర్గనైజేషన్లకు సభ్యత్వం పొందాయి. 2025 ఎడిషన్‌లో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి ట్రాన్సిట్ ఆపరేటర్ల నుంచి 500పైగా ఎంట్రీలు వచ్చాయి. ఆపరేషనల్ ఎక్సలెన్స్ కేటగిరీలో హైదరాబాద్ మెట్రో సమర్పించిన ఎంట్రీకి టాప్ 5 ఫైనలిస్టుల షార్ట్‌లిస్టులో చోటు దక్కింది. డేటా, సమర్థత ఆధారిత విధానాలకుగాను ప్రత్యేక గుర్తింపు లభించింది.. యూఐటీపీ నుంచి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం పొందడం తమకు ఎంతో గర్వకారణమని ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కేవీబీ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బనకచర్లకు అనుమతులివ్వలేం



- బనకచర్ల ప్రాజెక్టుకు ప్రస్తుత పరిస్థితుల్లో అనుమతులుండవు
- జీడబ్ల్యూడీటీ తీర్పు ఉల్లంఘనపై అభ్యంతరాలు
- 1983 గోదావరి ట్రైబ్యునల్ తీర్పుకు విరుద్ధంగా ప్రాజెక్టు నిర్మాణం
- పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీ అనుమతి తప్పనిసరి
- సెంట్రల్ వాటర్ కమిషన్ సమీక్ష అనంతరమే పూర్తి అనుమతులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చే పరిస్థితిలో లేదని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. ఈ ప్రాజెక్టుపై పలు అభ్యంతరాలు రావడంతో కేంద్రం నియమించిన నిపుణుల కమిటీ సమావేశమై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా కమిటీ వెల్లడించిన ప్రకారం, బనకచర్ల ప్రాజెక్టు గోదావరి ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) 1983 తీర్పును ఉల్లంఘించేలా ఉండవచ్చని ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను పరిశీలించిన నిపుణులు, "ప్రాజెక్టు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతోందన్న రాష్ట్ర ప్రభుత్వ వాదన అర్థవంతంగా కనిపించదని" అభిప్రాయపడ్డారు. పర్యావరణ అనుమతుల కోసం సెంట్రల్ వాటర్ కమిషన్ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేసింది. జీడబ్ల్యూడీటీ తీర్పు ప్రకారం ప్రాజెక్టు చేపడుతున్న విధానం వివాదాస్పదంగా ఉందని తెలిపింది. అలాగే, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి నీటి నిబంధనలతో పాటు, నీటి నిల్వలపై కేంద్ర స్థాయి అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. ఇందువల్ల పూర్తి స్థాయి పర్యావరణ అనుమతులను మంజూరు చేయడం ఇప్పటికిప్పుడు సాధ్యపడదని, అన్ని అంచనాలు, అనుమతులు పూర్తయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది.

# పేలిన రియాక్టర్లు 14 మంది మృతి

- సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి కెమికల్స్‌లో భారీ అగ్ని ప్రమాదం
- ఆచూకీ లేని మరో 40 మంది కార్మికులు
- ఘటనా సమయంలో విధుల్లో 110 మంది కార్మికులు
- పదుల సంఖ్యలో క్షతగాత్రులు
- హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లిన మంత్రులు, అధికారులు
- ప్రధాని, రాష్ట్రపతి దిగ్భ్రాంతి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పరిధిలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో ఘోర ప్రమాదం జరిగింది. పాశమైలారంలో ఉండే సీగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం రియాక్టర్ ఒక్కసారిగా పేలింది. రియాక్టర్ బ్లాస్ట్ అవ్వడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. పేలుడు ధాటికి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు గాల్లోకి ఎగిరి సుమారు 100 మీటర్ల దూరంలో పడ్డారు.. ఈ ఘటనలో 14 మంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో. 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు

వివరాలలోకి వెళితే పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో సోమవారం ఉదయం 9.30 గంటల సమయంలో కెమికల్ రియాక్టర్ పేలింది. దానితో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాద ధాటికి కంపెనీ ఆవరణలోని మూడంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. మరో భవనం బీటలు వారింది. ఈ ప్రమాదంలో 14 మంది కార్మికులు, సిబ్బంది మరణించారు. 40 మంది ఆచూకీ తెలియడంలేదు. వారంతా శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. ప్రమాద సమయంలో సిగాచి కెమికల్ పరిశ్రమలో 110 మంది కార్మికులు పని చేస్తున్నారు. కెమికల్ తయారీ ప్రాసెస్‌లో భాగంగా కొందరు కార్మికులు రియాక్టర్ వద్ద పని చేస్తారు. ప్రమాదం జరగ్గానే అక్కడి కార్మికుల దేహాలు వంద మీటర్ల ఎత్తుకు ఎగిరిపడ్డాయి. పేపేలుళ్లలో తీవ్రంగా గాయపడిన 13 మంది కార్మికులను అంబులెన్స్‌ల ద్వారా మదీనగూడలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం గురించి తెలియగానే సీఎం రేవంత్‌రెడ్డి అధికారుల్ని అప్రమత్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని ఆదేశించారు. సహాయ చర్యల్ని వేగవంతం చేయాలని చెప్పారు. ప్రమాదం గురించి తెలియగానే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సంఘటనా స్థలానికి వెళ్లారు. బాధితుల్ని పరామర్శించారు. అధికారుల్ని అప్రమత్తం చేశారు. 30 ఫైర్ ఇంజిన్లతో ఆ ప్రాంతంలో మంటల్ని అదుపు చేస్తున్నారు. విపత్తు నిర్వహణ బృందాలు శిథిలాలను తొలగించే పనులు చేపట్టాయి. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలంలో ఉండి సహాయ చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు.



అగ్ని ప్రమాదంలో ఇప్పటి వరకు 14 మంది మృతి చెందినట్టుగా గుర్తించారు. మృతుల్లో రాజనాల్ గజన్‌మోహన్, నాగజిత్, శశిభూషన్‌ను గుర్తించారు. మరో 37 మందిని మదీనగూడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న వారిలో నగ్నజిత్, రామ్‌సింగ్, సంజయ్‌కుమార్, నాగర్ జిత్ తివారి (ఒడిశా), రాంరాజ్, గణేష్‌కుమార్, అభిషేక్ కుమార్, దేవ్‌చంద్, ధన్‌బీర్ కుమార్ దాస్ (బీహార్), రాజశేఖర్‌రెడ్డి (ఏపీ) వారితో పాటు ఇంకొందరున్నారు. డ్యూటీలో 110 మంది ఉండగా 40 మంది ఆచూకీ లభించకపోవడంతో శిథిలాలను తొలగిస్తున్నారు.

### ప్రధాని, గవర్నర్, సీఎం, మాజీ సీఎం దిగ్భ్రాంతి

సంగారెడ్డి జిల్లా పాషామైలారం పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం జరిగిన ఘోర రసాయన కార్మికశాల పేలుడు ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ గవర్నర్ సీ.పి. రాధాకృష్ణన్, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

ప్రధాని మోదీ తన ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ:

"సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన ప్రమాదం వల్ల ప్రాణాలు కోల్పోయినవారిపట్ల మమతతో కూడిన సంతాపం. గాయపడినవారికి ప్రార్థనలు. మృతుల కుటుంబాలకు ప్రధాని సహాయ నిధి నుండి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడినవారికి రూ.50,000 అందిస్తాం," అని పేర్కొన్నారు. గవర్నర్ సీ.పి. రాధాకృష్ణన్ బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి ఉత్తమ వైద్య సేవలు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రిన్సిపాల్ సెక్రటరీ దానకిశోర్ ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం బాధితులకు పూర్తి మద్దతు, అవసరమైన వైద్యం కల్పించాలంటూ ప్రభుత్వాన్ని కోరారు.

# నేటి నుంచి పెరిగిన రైలు చార్జీల అమలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రైలు టికెట్ చార్జీలు స్వల్పంగా పెరిగాయి. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ తరగతి టికెట్ చార్జీలను కిలోమీటరుకు 1 పైసా వంతున, అన్ని ఏసీ తరగతుల టికెట్ చార్జీలను కిలోమీటరుకు 2 పైసల వంతున రైల్వే శాఖ పెంచింది. జూలై 1వ తేదీ నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నట్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిపాదిత చార్జీల పెంపుపై రైల్వే శాఖ అధికారులు జూన్ 24న సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే, రైళ్లు, తరగతి క్యాటగిరీల చార్జీల పట్టికని సోమవారం అధికారికంగా రైల్వే శాఖ ప్రకటించింది. రోజువారీ ప్రయాణికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సబర్బన్ రైళ్ల చార్జీలు, నెలవారీ సీజన్ టికెట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు. సాధారణ రెండవ తరగతి చార్జీలను 500 కిలోమీటర్ల దూరం వరకు పెంచలేదు. ఆపైన ప్రతి కిలోమీటరుకు అర్ధపైసా వంతున పెంచారు. సాధారణ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికులు కిలోమీటరుకు అర్ధపైసా చొప్పున జూలై 1 నుంచి అధికంగా చెల్లించాల్సి ఉంటుంది. చార్జీల పెంపుదల రాజధాని, శతాబ్ది, దురంతో, వందే భారత్, తేజస్, హమ్‌సఫర్, అమృత్ భారత్, మహామాన, గతిమాన్, అంత్యోదయ, జన శతాబ్ది, యువ ఎక్స్‌ప్రెస్, ఏసీ విస్టాడోమ్ కోచ్‌లు, అనుభూతి కోచ్‌లు, సాధారణ నాన్–సబర్బన్ సర్వీసులకు క్లాసుల వారీగా వర్తిస్తుంది. జూలై 1 కన్నా ముందు జారీ అయిన టికెట్లు పాత చార్జీలతోనే చెల్లుబాటు అవుతాయి. రిజర్వేషన్ చార్జీలు, సూపర్‌ఫాస్ట్ సర్‌చార్జీలు, ఇతర చార్జీలలో ఎటువంటి మార్పులు లేవని రైల్వే శాఖ తెలిపింది. నిబంధనల ప్రకారం జీఎస్‌టీ ఉంటుందని రైల్వే శాఖ పేర్కొంది. మరోవైపు తత్కాల్ టికెట్ బుకింగ్‌కు ఆధార్ వివరాల నమోదును తప్పనిసరి చేసింది.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.రామచందర్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్.రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన అధ్యక్ష పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి శోభా కరంద్లాజే స్వీకరించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికల నామినేషన్లు కూడా స్వీకరించబడ్డాయి. రాజాసింగ్ కూడా అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసేందుకు వచ్చారు. ఆయనకు పది మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల మద్దతు లభించలేదు. కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే సంతకం చేయడంతో నామినేషన్ దాఖలు చేయలేకపోయారు. అధ్యక్షున్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసుకోవాలనే అధిష్టానం ఆదేశాలతో ఆయనకు పోటీగా ఎవ్వరూ నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే, మంగళవారం మన్నెగూడలోని వేద కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కౌన్సిల్ సభ్యుల పేర్లను అధికారికంగా ప్రకటించనున్నారు. నరపరాజు రామచందర్‌రావు 1959 ఏప్రిల్ 27న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన భార్యపేరు సావిత్రి. ఆయనకు ఇద్దరు పిల్లలున్నారు. ఆయన తండ్రి ఉస్మానియా వర్సిటీ ప్రొఫెసర్ కావడంతో వర్సిటీలోనే ఉండేవారు. అదే వర్సిటీలో ఎమ్ఏ(పొలిటికల్ సైన్స్), లా విద్యలను అభ్యసించారు. రైల్వే కాలేజీలో డిగ్రీ చదివే రోజుల్లోనే ఏబీవీపీలో చేరారు. ఆ కాలేజీ అధ్యక్షులుగా మూడేండ్లపాటు పనిచేశారు. వర్సిటీలో కొందరు ఆయనపై దాడి చేయడంతో కొన్ని నెలల పాటు ఇంటికే పరిమితమయ్యారు. 1977 నుంచి 85 వరకు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. 1986లో అధికారికంగా బీజేపీ పార్టీలో చేరారు. రవీంద్రనగర్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేశారు. 1980–82 కాలంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, 2003–06 మధ్యకాలంలో బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా బాధ్యలు నిర్వర్తించారు. బీజేపీ హైదరాబాద్ నగర అధ్యక్షులుగానూ పనిచేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా 2007–15 వరకు బాధ్యతలు చేపట్టారు. 2015లో హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2021 వరకు మండలిలో బీజేపీ ఫ్లోర్‌లీడర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం సుప్రీం కోర్టులో ట్రిబ్యునళ్లలో క్రిమినల్, సివిల్, రాజ్యాంగ సంబంధిత కేసుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. బీజేపీకి లీగల్ సంబంధింత అంశాల్లో సేవలందిస్తున్నారు.



# బీజేపీకి రాజాసింగ్ రాజీనామా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక ఆ పార్టీలో కల్లోలం సృష్టిస్తున్నది. పదవి కోసం పోటీపడి భంగపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పంపినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన రాజీనామాను ఆమోదించాలని కిషన్‌రెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వెయ్యనివ్వలేదని ఆరోపించారు. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వస్తే.. తన మద్దతుదారులను కొందరు బెదిరించారని, జాతీయ కౌన్సిల్ సభ్యులు మద్దతు ఇవ్వకుండా బెదిరించారనర్నారు. పార్టీలో ఉంటారా? సస్పెండ్ చేయాలా? అని హెచ్చరించారని తెలిపారు. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయనివ్వలేదన్నారు.

నా నామినేషన్ పత్రంపై సంతకం చేసేందుకు పది మంది సిద్ధంగా ఉన్నారని.. కానీ, మద్దతుదారులను నామినేషన్‌పత్రంపై సంతకాలు చేయనివ్వలేదని విమర్శించారు. నా విషయంలో లక్షలాది మంది కార్యకర్తలు బాధపడుతున్నారన్నారు. రామచందర్‌రావుకు అధ్యక్ష పదవి ఇవ్వడంపై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందన్నారు. 2014 నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానన్నారు. బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలో ముందే డిసైడ్ చేశారని, పార్టీ సింబల్‌పై తాను ఎమ్మెల్యేగా గెలిచానని.. రాజీనామా లేఖను సైతం కిషన్‌రెడ్డికి అందించానన్నారు. స్పీకర్‌కు రాజీనామా లేఖను కిషన్‌రెడ్డే పంపించాలన్నారు. పార్టీ కోసం తాను సర్వం ధారపోశానని.. ఉగ్రవాదులకు టార్గెట్‌గా ఉన్నానన్నారు. మీకో దండం.. మీ పార్టీకో దండం అంటూ వ్యాఖ్యనించిన రాజాసింగ్.. ఆ పార్టీకి రాజీనామా చేసిన హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు బీజేపీ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

# అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలవాలి



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అంగన్‌వాడీలు దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని.. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు అయిదేళ్ల వరకు వారికి పూర్వ ప్రాథమిక విద్యను అందించి నేరుగా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లేలా చూడాలని సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారిత శాఖలపై మంత్రులు ధనసరి అనసూయ సీతక్క గారు, పొన్నం ప్రభాకర్ గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారితో పాటు ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు.

"అంగన్‌వాడీలకు నూతన భవనాలు నిర్మించే విషయంలో అధునాతన సాంకేతికతను వినియోగించుకోవాలి. పిల్లల అవసరాలకు తగినట్లు కంటైనర్లతో డిజైన్ చేయించే అంశాన్ని అధ్యయనం చేయాలి. సోలార్ ప్లేట్లు, బ్యాటరీ బ్యాకప్‌తో కంటైనర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తే తక్కువ వ్యయం, ఎక్కువ సౌకర్యం ఉంటుంది. ఈ అంశంపై ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఉన్న కంటైనర్ కేంద్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రతి పిల్లవానికి పౌష్టికాహారం అందించాలి. ఇందుకు ఎన్జీవోల సేవలు వినియోగించుకోవాలి. బాలామృతం ప్లస్‌ను పెద్ద మొత్తంలో ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి. కర్ణాటకలో జొన్న రొట్టెలను వినియోగిస్తున్నందున పౌష్టికాహార నిపుణులతో చర్చించి వాటిని మహిళా సంఘాలతో పిల్లలకు అందించే అంశంపైనా దృష్టి సారించాలి. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేత, అంగన్‌వాడీల పర్యవేక్షణ, నిర్వహణపై వంద రోజుల కార్యాచరణ రూపొందించి అమలు చేయాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం విషయంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు కలిసే పని చేయాలి. అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తున్నట్టే, ఏటీసీల్లోనూ వాళ్లకు ప్రవేశాలు కల్పించాలి. మన పిల్లలను సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే ఒప్పందం చేసుకున్నాం. అక్కడకు పంపే వారిలో అనాథ పిల్లలకు చోటు కల్పించాలి.

టర్ రింగు రోడ్డు పరిధిలోని బస్తీలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని పిల్లల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. నిర్దేశిత సమయంలో అక్కడి పిల్లలకు ఆయా వాహనాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలి. విశ్రాంత ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు ఆయా పిల్లలకు బోధన చేసేందుకు ఆసక్తి చూపితే అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి. తెలంగాణ ఫుడ్స్, విజయా డెయిరీ ఉత్పత్తులను అంగన్‌వాడీలకు అందేలా చూడాలి" అని చెప్పారు. నిర్లక్ష్యానికి గురవుతున్న తల్లిదండ్రులను లేదా కుటుంబ సభ్యులు పట్టించుకోలేని స్థితిలో ఉన్న వృద్ధులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఉద్యోగులైతే వారి వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రులకు ఖాతాలకు 10–15 శాతం జమ అయ్యే అంశాన్ని పరిశీలించాలని, ఈ అంశంలో సమగ్రమైన నివేదిక సమర్పించాలని అధికారులకు సీఎం గారు సూచించారు. ట్రాన్స్‌జెండర్లకు ప్రస్తుతం ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించామని, వారి సేవలను రవాణా, దేవాదాయ శాఖ, వైద్యారోగ్య శాఖలతో పాటు ఐటీ, ఇతర కంపెనీల సేవల్లో వినియోగించుకునేలా చూడాలని సీఎం ఆదేశించారు.

తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యంగా దివ్యాంగుల మధ్య వివాహాలు, వివిధ పథకాల్లో దివ్యాంగులకు ప్రోత్సాహకాలు కల్పించే విషయంపై అధ్యయం చేసి వచ్చే మంత్రిమండలి సమావేశం నాటికి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు.

# కాంగ్రెస్ పాలనలో కుదేలవుతున్న గురుకులాలు

**మాజీ మంత్రి హరీష్ రావు..**

**బలగం టీవీ, హైదరాబాద్:**



తెలంగాణలో బిఆర్ఎస్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన గురుకుల పాఠశాలలు, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యమవుతున్నాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని అన్నారు. రేవంత్ పాలనలో గురుకుల పాఠశాలలు, కళాశాలల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. జనవరి నుండి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో కోడిగుడ్లు, మాంసం, అరటి పండ్ల సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. బకాయిలు చెల్లించకుంటే జులై 1 నుండి అన్ని రకాల ఆహార పదార్థాలు, ఇతర సామాగ్రి సరఫరాను నిలిపేస్తామని కాంట్రాక్టర్లు హెచ్చరించే పరిస్థితి వచ్చిందని అన్నారు.

మరోవైపు, 13 నెలలుగా రూ. 450 కోట్లకు పైగా అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దుస్థితి నెలకొందని హరీష్ రావు పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇన్ని రోజులు అవుతున్నా ఇప్పటికీ యూనిఫాం, టై, బెల్ట్, బూట్లు, స్కూల్ బ్యాగులు ఇవ్వకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో యూనిఫాం ఇవ్వకపోవడంతో పిల్లలు పాత, చినిగిపోయిన దుస్తులు వేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లలో అద్భుతంగా నడిచిన గురుకులాల వ్యవస్థ, రేవంత్ రెడ్డి పాలనలో కుదేలవుతుండటం దురదృష్టకరమని హరీష్ రావు అన్నారు. దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని నిలబెట్టాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేద పిల్లల భవిష్యత్తును కాపాడాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం జూలై 17న రైల్ రోకో: ఎమ్మెల్సీ కవిత




**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం తన నివాసంలో సింగరేణి జాగృతి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ (యునైటెడ్ పూలే ఫ్రంట్) ఆధ్వర్యంలో జూలై 17న తలపెట్టిన రైల్ రోకోకు సింగరేణి జాగృతి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని అన్నారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్, బీసీ సమాజం పోరాటాలతోనే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చిందని, అసెంబ్లీ, కౌన్సిల్‌లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే రెండు వేర్వేరు బిల్లులను పాస్ చేసిందని అన్నారు. అయితే, ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం కూడా చేయలేదని అన్నారు.

బీసీ రిజర్వేషన్లు తేల్చకుండానే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల పరంగా అవకాశం కల్పించడం కాదని, బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకే రైల్ రోకోకు పిలుపునిచ్చామని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా రైల్ రోకో చేసి తీరుతామని అన్నారు. సింగరేణి జాగృతి తమ రైల్ రోకోకు సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, బీసీ రిజర్వేషన్ల కల్పన, రైల్ రోకో అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. జూలై 16, 17, 18 తేదీల్లో ఎవరూ ప్రయాణాలు పెట్టుకోవద్దని ఆమె మరోసారి విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే..

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 27 ఫిర్యాదులు స్వీకరణ:**

**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులను ఎస్పీ మహేష్. బి.గితే స్వీకరించినారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్. బి.గితే మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

# హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ముంపు ఇబ్బందులు ఎదుర్కొన్నవారు అందుకు గల కారణాలను వివరిస్తూ నాలాల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే నిర్మాణుష్యంగా ఉన్న లే ఔట్ల చుట్టూ ఉన్న ప్రహరీలు, ఇప్పుడు తమ రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లేఔట్లో పార్కులుగా చూపించి వాటిని ప్లాట్లుగా అమ్మేస్తున్నారని, ప్రజావసరాలైన గుడికి, బడికి, కమ్యూనిటీ హాళ్లకు ఉద్దేశించిన ప్లాట్లను కూడా కబ్జా చేస్తున్నారని పలువురు ఫిర్యాదులందించారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులందాయి. నాలాలు, పార్కులను ఆక్రమించి భవనాలు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారని సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా నగరం నలువైపుల నుంచి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు శ్రీ వర్ల పాపయ్యగారు పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే వాటిని సంబంధిత అధికారులకు అప్పగించి తదుపరి చర్యలకు ఆదేశించారు.

# రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు గుడ్‌న్యూస్..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని వైద్య విద్యార్థులకు గుడ్‌న్యూస్ చెప్పింది.మెడికల్, డెంటల్ విద్యార్థులతో పాటు సీనియర్ రెసిడెంట్లకు ఇచ్చే స్టయిఫండ్‌ను 15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రంలోని వేలాది మంది వైద్య విద్యార్థులకు ఆర్థికంగా అండగా నిలిచినట్లైంది. 15 శాతం స్టైఫండ్ పెంపుతో ఇంటర్న్‌లకు నెలకు 29వేల 792 రూపాయలు, పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్ 67వేల 32 రూపాయల స్టైఫండ్ అందనుంది. ఇక సెకండియర్‌లో 70వేల 757 రూపాయలు, ఫైనల్ ఇయర్‌కు 74వేల 782 రూపాయల స్టయిఫండ్ అందనుంది. స్టైఫండ్ పెంపుతో పాటు, తెలంగాణ ప్రభుత్వం వైద్యారోగ్య శాఖలో పని చేస్తున్న దాదాపు 16వేల 448 మంది ఉద్యోగుల సర్వీసును మరో ఏడాది పాటు పొడిగిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పొడిగింపు ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పని చేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో 4,772 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 8,615 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, 3,056 మంది గౌరవ వేతన పద్ధతిలో పని చేస్తున్నవారు మరో 5 మంది %మీూ% ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు ఉన్నారు. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అధికారిక ప్రకటన విడుదల చేశారు.



# మానసిక సమస్యలను నిర్లక్ష్యం చెయ్యద్దు

**సైకాలజిస్ట్ కె. పున్నం చందర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలోనీ మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ద్వారా ఈ రోజు ప్రగతి నగర్ లోని కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహించినారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాటడుతూ మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. కార్మికులలో నిద్ర సమస్యలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. నిద్రలేమి వల్ల అనేక మానసిక సమస్యలు, శారీరక అనారోగ్యాలు వస్తాయని అన్నారు. జీవన శైలి వ్యాధులు బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్, క్యాన్సర్స్, ఆత్మహత్య ఆలోచనలు ఎక్కుగా ఉంటున్నాయని, ప్రతికూల ఆలోచనల్ని విడనాడి అనుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడం ద్వార, చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అనేక జీవన శైలి వ్యాధుల బారి నుండి బయట పడవచ్చని అన్నారు. కార్మికుల కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య వివాదాలు ఎక్కువగా ఉన్నాయని మైండ్ కేర్ సెంటర్ ద్వారా ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమస్య ఉండటం సహజమని తెలుపుతూ సమస్యపై కాకుండా వాటి పరిష్కారమార్గాల మీద దృష్టి నిలిపి ఓపికతో పరిష్కరించుకోవాలని అన్నారు. కార్మికుల్లో పొదుపు ప్రవృత్తి తక్కువగా ఉందని, తమ ఆదాయంలోంచి ఎంతో కొంత పొదుపు చేయడం అలవర్చుకోవాలని అన్నారు.

సిరిసిల్ల ప్రభుత్వ వైద్యశాలలో శారీరక, మానసిక ఆరోగ్య వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎటువంటి మానసిక సమస్యలు ఎదురైనా వాయిదా వేయకుండా వెను వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ పవర్ లూమ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని, ఎటువంటి మానసిక సమస్య ఎదురైనా తమను సంప్రదించాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది కొండ ఉమ, రాపెల్లి లత, బూర , కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరతను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు..

**బలగం టీవీ, సంగెం**

కాపుల కనపర్తి రైతు సేవా సహకార సంఘం పరిధిలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, దీనిపై మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. సంగెం మండలం గవిచర్ల గ్రామం గుండా వెళ్తున్న దయాకర్ రావు వాహనాన్ని ఆపి, అక్కడ ఉన్న రైతులు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. రైతులు తమ బాధను వివరిస్తూ, “సాగునీరు రాక, ఎరువుల కొరతతో అప్పుల పాలవుతున్నాం. మార్పు మార్పు అని మోసపోయాం, ఇప్పుడు ఎరువులు రాక ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాం. అందరి కడుపు నింపే రైతే ఎరువుల కోసం పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గోడు విన్న దయాకర్ రావు, అక్కడే ఉన్న ఎరువుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ అసమర్థ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాని అన్నారు.





## బెస్ట్ అవైలేబుల్ పాఠశాల విద్యార్థుల అవస్థలు..

- విద్యార్థులను హాస్టల్లో చేర్చుకోని యాజమాన్యం
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తంగళ్ళపల్లి లోని శ్రీ సరస్వతి పాఠశాలలో బెస్ట్ అవైలేబుల్ ద్వారా చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు సంవత్సరాల నుండి శ్రీ సరస్వతి స్కూలుకు బిల్లులు రాకపోవడంతో విద్యార్థులను హాస్టల్ కు తీసుకు రాకూడదని తల్లిదండ్రులకు స్కూల్ యజమాన్యం సూచించింది. దీంతో దిక్కు తోచని స్థితిలో సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో సరైన విద్య ప్రమాణాలు లేవని మరియు భోజనం వసతి సౌకర్యాలు అంతంతే నని, పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు బెస్ట్ అవైలబుల్ కింద సీటు రావడంతో అక్కడ ఎంతో నాణ్యమైన విద్య అందుతుందని మొదట మురిపించిందని ఇలా పాఠశాల యజమాన్యం ఇబ్బందులకు గురిచేయడం వల్ల విద్యార్థులు మానసిక అందోలోనాలతో కృంగిపోతున్నారని వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు.



## అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి..

**-ప్రజావాణికి 157 దరఖాస్తుల రాక**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణిలో వచ్చే అర్జీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వీకరించి.. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల బోయినిపల్లి మండలం కొదురుపాక హైస్కూల్ 1998-1999 సంవత్సరం పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రోజున జరుపుకున్నారు. వేములవాడ అర్బన్ మండలం నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నాంపల్లి గుట్ట కింద శ్రీ లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో అందరూ ఒక చోట కలుసుకొని ఒకరికి ఒకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు .చదివిన బడి, నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

## నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి..



- గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాము..
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మిడ్ మానేర్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలోని మిడ్ మానేర్ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలు కొదురుపాక, వరద వెల్లి, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరయ్యారు.

అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, మిగితా బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని అన్నారు. దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని అన్నారు.

**గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాము..**

కొదురుపాకలో బుధవారం, వరద వెల్లిలో గురువారం, నీలోజిపల్లిలో శుక్రవారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక శిబిరం ద్వారా సమావేశాలు నిర్వహించి, నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆయా గ్రామాల నిర్వాసితులు తమ సమస్యల పై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో ఎస్డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమాతో ఆర్థిక భరోసా..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

స్వయం సహాయక సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా కల్పిస్తూ ఆర్థికంగా భరోసా కల్పిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు బీమా, సభ్యులకు ప్రమాద బీమా చెక్కులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ముస్తాబాద్ మండలంలో 14 మందికి రూ. 14,96,457, తంగళ్ళపల్లి మండలంలో ఒకరికి రూ. 30 వేలు, గంభీరావుపేట మండలంలో 8 మందికి రూ.7,66,925, వీర్నపల్లి మండలంలో ఇద్దరికి రూ.2,67,434, ఎల్లారెడ్డిపేట మండలంలో 12 మందికి రూ.13,04,133 మొత్తం రూ. 38, 64,949 విలువైన చెక్కులు ఆయా స్వయం సహాయక సంఘాల బాధ్యులకు అందజేశారు.

**ఇద్దరికి ప్రమాద బీమా పంపిణీ..**

అలాగే ముస్తాబాద్ మండలంలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు సభ్యులు ప్రమాదవశాత్తూ మరణించగా, వారికి నామిని లకు రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల విలువైన చెక్కులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కి పదవి విరమణ తప్పనిసరి..**

– కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్ల: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కి పదవీ విరమణ తప్పనిసరి అని,రొడ్డ కుమారస్వామి సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు.. నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యకుడు, జమేదార్ రొడ్డ కుమారస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సన్మానించారు. రొడ్డ కుమారస్వామి రెవెన్యూ శాఖలో దాదాపు 32 ఏండ్లు సేవలు అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు ఫిబ్రవరి 2021 బదిలీపై వచ్చి, జమేదార్ గా సేవలు అందిస్తున్నారు. అనంతరం వారిని మెమెంటో , శాలువాలతో సన్మానించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాంరెడ్డి డిఆర్డిఓ శేషాద్రి ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండ

**-గ్రడ్డం మధుకర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



నిరుపేదల కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతగానో అండగా ఉంటుందని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ గడ్డం మధుకర్ (చోటు) పేర్కొన్నారు. ఇందిరమ్మ కాలనీ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీ గ్రామానికి చెందిన దోమల హారతి %-% రాజు దంపతులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 17,500 (పదిహేడు వేల ఐదు వందల రూపాయలు) చెక్కును స్థానిక నాయకులతో కలిసి గడ్డం మధుకర్ అందజేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కెకె మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోనీ) లకు దోమల హారతి %-% రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్యామ్, బల్ల లక్ష్మీపతి, అంబటి అంజయ్య, వేముల రాజశేఖర్, కర్ర నరేష్, దూస సత్తయ్య, గ్రామ మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఆడిగొప్పుల యమున, మందాటి శారద, దీకొండా జ్యోతి, బైరీ మౌనిక, కనుకుంట్ల రేణవ్వ, గుడ్ల వసంత తదితరులు పాల్గొన్నారు.